"ఏమండీ ఇవాళ సినిమాకి వెళదామా?" భర్త చంద్రాన్ని అడిగింది సురేఖ.

"అబ్బా... ఇవాళా?... మరో రోజు వెళ దాంలెద్దూ" అన్నాడతను.


"ఎప్పుడూ మీరిలాగే అంటారు. మనం సినిమాకి వెళ్ళి ఎన్ని రోజులయిందో తెలుసా?"

"నష్టమేమీ లేదు. ఈరోజుల్లో వచ్చే సినిమాలలో ఏముంది? సెక్సు, వయొలెన్స్ తప్ప" అన్నాడతను.

"పోనీ పాత సినిమాకి వెళదాం. మిస్సమ్మ వచ్చిందట".

"ఆ సినిమా చాలాసార్లు చూసాంకదా. అయినా కేబుల్ టి.వి.లో రోజూ బోలెడు సినిమాలు వేస్తున్నారు. మళ్ళీ థియేటర్‌కి ఎందుకు దండగ?".

ఎప్పుడూ వాళ్ళిద్దరి మధ్యా సంభాషణ దాదాపు ఇలాగే మొదలయి, ఇలాగే ముగుస్తూ ఉంటుంది. పెళ్ళయిన కొత్తలో చంద్రం బాగానే ఉండేవాడు. రానురాను అతనికి ఏ విషయం



# మైనస్ x మైనస్

పట్లా శ్రద్ధ, ఆసక్తీ ఉండడం లేదు. ఒక్క సినిమా విషయంలోనే కాదు. పార్కుకి వెళదామన్నా లేదా ఏదైనా ఫంక్షన్‌కి వెళదామన్నా ఆసక్తి చూపడు. తప్పనిసరిగా వెళ్ళాల్సిన ఫంక్షన్స్‌కి అయితే అయిష్టంగానే కదుల్తాడు.

మొదట్లో సినిమాలకు వెళ్ళడానికి అతను ఆసక్తి చూపకపోవడానికి కారణం డబ్బు ఖర్చుపెట్టడం ఇష్టంలేకేమో అనుకుంది. కానీ అతను ఖర్చుకి వెనకాడే మనిషికాదు. అనవసర ఖర్చులు బోలెడుపెడుతూ ఉంటాడు. సరదాలకి మాత్రం విముఖంగా ఉంటాడు.

ఆఫీసు ఉన్న రోజుల్లో సాయంత్రం ఎక్కడికైనా వెళదాం అంటే 'ఆఫీసులో అలిసిపోయి వచ్చాను. రావాలని లేదు' అనేవాడు. ఆదివారం నాడు 'వారానికి సెలవు వచ్చేదే ఒకరోజు... కాస్త విశ్రాంతి తీసుకోనివ్వవా' అనేవాడు. పోనీ ఇంట్లో ఉన్నా టి.వి.అయినా చూస్తాడా అంటే అదీలేదు. 'అన్నీ చెత్త ప్రోగ్రామ్‌లు. టి.వి. చూడడం శుద్ధ దండగ' అనేవాడు. ఇవన్నీ ఒక విధంగా భరించవచ్చు. అంతకన్నా ముఖ్యమైనది అతని నైరాశ్యపుమాటలు. ఏ విషయంలోనైనా 'ఆ మనదీ ఒక బతుకేనా? మన ఖర్మ ఇలా ఉంటే మంచి ఎలా జరుగుతుంది?' అన్నట్టు మాట్లాడేవాడు.

పిల్లల చదువు విషయంలో కూడా అంతే. వీళ్ళు చదివి ఉద్ధరించేదేముంది? వీళ్ళకి వచ్చే మార్కులకి పెద్ద పెద్ద ఉద్యోగాలు వచ్చేస్తాయా? అనేవాడు. అసలు వాళ్ళ చదువుల గురించి పట్టించుకునేవాడు కాదు. దాంతో వాళ్ళుకూడా అంతంత మాత్రంగానే చదివేవారు. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో వాళ్ళకి వచ్చిన మార్కులు చూసి "చెప్పాను కదా. మనకి ఇంతకన్నా గొప్పగా మార్కులు ఎక్కడనుంచి వస్తాయి?" అనేవాడు నిరాశగా. అలా తక్కువ మార్కులు రావడానికి కారణం ప్రయత్నలోపం అనుకునేవాడు కాదు.

అతనికో స్కూటర్ ఉంది. స్కూటర్ అన్నాక అపుడపుడూ ట్రబుల్స్ రావడం, పంచర్స్ పడడం సహజం. దానికి కూడా అతను "ఏమిటో ఈ స్కూటర్ తెగ ఇబ్బంది పెట్టేస్తోంది. నాకు అన్నీ ఇలాగే అఘోరించాయి" అని అందరి దగ్గరా బాధపడేవాడు.

ఇంటిపన్ను, ఎలక్ట్రిసిటీ బిల్లు వంటివి కట్టడం లోనూ నిర్లక్ష్యమే. బిల్లు వచ్చినపుడు "ఆ... కడదాంలే కంగారేమి ఉంది?" అనేవాడు. భార్య తొందరపెడితే విసుక్కునేవాడు. "బయటకు వెళితే నాకు బోలెడు పనులు. ఇంట్లో తీరిగ్గా కూర్చుని ఒకటే సతాయిస్తున్నావు. నాకు తెలియదా ఎప్పుడేమి చేయాలో? ఇంకా చాలా రోజులు టైం ఉందిలే" అనేవాడు. అలా రోజులు గడిపేసి, ఆఖరితేదీ అయిపోయి పెనాల్టీ

కాశీభట్ల శశికాంత్

తోసహా కట్టాల్సిన గడువు సమీపించినపుడు కానీ కదిలేవాడు కాదు. తను చేసిన ఆలస్యం గురించి మరిచిపోయి, పెనాల్టీలపేరుతో దోచేస్తున్నారు అని వాపోయేవాడు.

నిజానికి అంత నిరాశగా రోజులు గడపాల్సిన పరిస్థితులు అతనికి లేవు. అతను ప్రైవేట్ కంపెనీలోనే పనిచేస్తున్నా ఆఫీసరుగా మంచి జీతం అందుకుంటున్నాడు. పెద్దలు ఇచ్చిన స్వంత ఇల్లు, అయిదెకరాల పొలం కూడా ఉంది.


ఎప్పుడూ నిరాశాపూరిత మాటలు విని, విని నెమ్మది నెమ్మదిగా ఆమెకు తెలియకుండా ఆమెలోనూ అదే తరహా చోటు చేసుకుంది. ఆమె చిన్ననాటి స్నేహితురాలు ఆమెను కలిసి మాట్లాడిన కొద్దిక్షణాలలోనే ఆ విషయం గుర్తించి, తనతో అనేదాకా సురేఖ తెలుసుకోలేకపోయింది.

"కాలేజీ రోజుల్లో ఎంత హుషారుగా ఉండే దానివి? ఇపుడేమిటి ఇలా అయిపోయావు?" అడిగింది స్నేహితురాలు.

"ఎందుకో రోజులన్నీ నిస్సారంగా గడుస్తున్నాయి. అసలు ఈ పరిస్థితులలో మార్పు అనేది ఎప్పటికైనా వస్తుందా అనిపిస్తోంది" అంది సురేఖ.

ఆ స్నేహితురాలికి సురేఖ అలా ఎందుకయిందో తను అక్కడ ఉండగానే వచ్చిన చంద్రాన్ని చూసాక బోధపడింది. అతను లోపలికి వెళ్ళాక సురేఖతో అంది.

"ఆనందంగా, ఉత్సాహంగా ఉండేవాళ్ళు తమ జీవితాల్ని క్రమపద్ధతిలో, ఆసక్తికరంగా, నిత్యనూతనంగా మలచుకుంటారు. వారికి ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో వస్తాయి.




వాటివల్ల జీవితం మరింత ఉత్సాహంగా కనబడుతుంది. మీ ఆలోచనలు దానికి పూర్తివిరుద్ధంగా ఉన్నాయి. ఆ సైకిల్ నుంచి బయటపడితేనేగానీ మీ పరిస్థితులు బాగుపడవు. కాలం గడిచేకొద్దీ ఆ ఊబిలో బయటకు రాలేనంతగా కూరుకుపోతారు. వెంటనే జాగ్రత్తపడు. ఒకవేళ అది మీ అంతట మీకు సాధ్యంకాకపోతే కౌన్సిలింగ్ ద్వారా నయమవుతుంది".

"ఏదో మా పరిస్థితులు బాగాలేక ఇలా ఉన్నాంకానీ, ఈమాత్రం దానికి డాక్టర్లు, కౌన్సిలింగ్‌లు ఎందుకులే" నిష్ఠూరంగా అంది సురేఖ.

ఇక బాగుపడరు... అనుకునేంతగా వారి పరిస్థితి దిగజారిపోలేదు. ఏ మందు వాడి ఈ వ్యాధి కుదిర్చి, స్నేహితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలా అని ఆలోచనలో పడింది ఆ స్నేహితురాలు.

* * *

ఒకరోజు ఉదయం ఆఫీస్‌కి వెళ్ళడానికి తయారవుతున్న చంద్రం ఫోన్ రింగయితే తీసి

మాట్లాడాడు.

"హలో..."

"చంద్రం... శ్యామలరావుని మాట్లాడుతున్నాను. ఎక్కౌంటెంట్ నాగరాజు హార్ట్‌ఎటాక్ వచ్చి చనిపోయాడు"

"ఎప్పుడు?" అన్నాడు చంద్రం కంగారుగా

"తెల్లవారు ఝామున నాలుగు గంటలకి పోయాడు. నీకు అతని ఇల్లు తెలుసుకదా. వెంటనే రా"

చంద్రం ఫోన్ పెట్టేసి కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమయిందండీ" ఆదుర్దాగా అడిగింది సురేఖ.

చంద్రం విషయం చెప్పాడు.

"వయస్సు ఎంత ఉంటుంది?"

"నలభై అయిదేళ్ళు ఉంటాయి. అయినా ఈ రోజుల్లో వయస్సుతో నిమిత్తం ఏముంది? ఎవరికాలం తీరితే వాళ్ళు వెళ్ళిపోవడమే. ఇవాళ అతను, మరోరోజు మనం..." విచారంగా అన్నాడు.

సురేఖకి మనసంతా భయంతో నిండిపోయింది. రోజులు ఎంత అనిశ్చితంగా ఉన్నాయి? రేపేం జరుగుతుందో అనేది ఎపుడూ బెంగే. ఆమె ఆ ఆలోచనలలో ఉండగానే చంద్రం వెళ్ళిపోయాడు.

* * *

"సురేఖా త్వరగా తయారవ్వు. సినిమాకి వెళదాం" మర్నాడు ఆఫీసునుంచి వస్తూనే హడావుడిగా అన్నాడు చంద్రం.

చంద్రంలో అంత ఉత్సాహం ఆమధ్యకాలంలో చూడలేదేమో ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది ఒక్క క్షణం.

"ఏమిటీ అలా చూస్తూ ఉండిపోయావు. పిల్లల్ని కూడా త్వరగా రెడీచెయ్యి".

"ఆఫీసుకి వెళ్ళేటపుడు చెప్పొచ్చుగా. వంట చేసేద్దును. ఇప్పటికిపుడు సినిమా అంటే ఎలా?"

"ఈ రోజుకి హోటల్లో భోజనం చేసేద్దాం" అన్నాడు చంద్రం.

హఠాత్తుగా అతనిలో అంతమార్పు ఎందుకు వచ్చిందో సురేఖకి అర్ధంకాలేదు.

స్కూటర్ మీద వెళుతూ దారిలో అతను అన్నాడు...

"నిన్న స్మశానానికి వెళ్ళి వచ్చినప్పటినుంచి ఒకటే ఆలోచనలు. జీవితం ఎంత అనిశ్చితమైనది? నాగరాజు ఆమధ్య ఒక స్థలం కొన్నాడు. దానిని రిజిస్ట్రేషన్ చేయించాలి. కొన్ని రోజులుగా ఆ పనిని వాయిదా వేసుకుంటూ వస్తున్నాడు. రేపు ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తున్నానని మొన్న మాతో అన్నాడు. కానీ ఆ పని చేయించే అవకాశం అతనికి లేకుండా పోయింది. రేపటికి ఎవరు బతికి ఉంటారో ఎవరికి తెలుసు? అందుకే ఈ రోజు నుంచి ఏదీ వాయిదా వేయకుండా ఎప్పటి పనులు అప్పుడు చేయాలనుకుంటున్నాను. అలాగే ఉన్నన్నాళ్ళూ ఉత్సాహంగా, ఆనందంగా గడపాలనుకుంటున్నాను".

ఎప్పుడూ నిరాశగా ఈసురోమంటూ ఉండే అతను స్మశానవైరాగ్యంతో మరింత డీలాపడిపోతాడు అనుకున్న ఆమెకు వైరాగ్యం అతనిలో జీవనోత్సాహాన్ని రేకెత్తించడం వింతగా అనిపించింది. ●